Eid-ul-Fitr kis ke liye?
(Telugu)

# రమజాన్ శుభాలకు అర్హులు

రచన

**మౌలానా మౌదూది**

అనువాదం

**యం.డి. ఉస్మాన్ ఖాన్**

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

# రమజాన్ శుభాలకు అర్హులు

ఈద్ (పండుగ) ఇస్లామీయ సమైక్యతకు ఓ గొప్ప నిదర్శనం. అందు కని దీనికి ఖచ్చితంగా ఒక రోజంటూ నిర్ణయమై ఉండాలంటూ కొన్ని వర్గాలు ఉధృతంగా ప్రచారం చేస్తున్నాయి. ప్రపంచ ముస్లిములందరూ ఒకేరోజు పండుగ జరుపుకొనే విధంగా ఒకేరోజు, ఒకేతేదీ నిర్ణయమై ఉండాలనేది వీరి భావన. కాని ఈ భావన పూర్తిగా తప్పు. ధర్మాన్ని గురించి పూర్తి అవగాహన లేకపోవడం వల్ల ఇలాంటి ఆలోచనలు వస్తుంటాయి. ఇలాంటి అభిప్రాయం కలిగిన చాలామంది రమజాన్ మాసంలో ఉపవాసాలు పాటించరుగాని, పండుగ విషయంలో మాత్రం ఇస్లాం, ముస్లింల సమైక్యతను గురించి తెగ బాధపడిపోతుంటారు.

వీరి దృష్టిలో పండుగ (ఈద్) అంటే దసరా, దీపావళి, క్రిస్మస్ లాంటి ఒక పండుగ ముస్లింల జాతీయసమైక్యతకు చిహ్నంగా జరుపుకొనే జాతీయపండుగ మాత్రమే! నిజానికి ఇది రమజాన్ మాసం ఆరంభంతో ప్రారంభమయ్యే దైవారాధనతో సంబంధం కలిగివుండే పండుగ. ఈ ఆరాధన (రోజా) రమజాన్ మాసం ఉపవాసాల పాటింపుతో దైవానికి కృతజ్ఞతగా చెల్లించే రెండు రకాతుల నమాజుతో ముగుస్తుంది. షరిఅత్ ఆదేశాల ప్రకారం రమజాన్ మాసం ప్రారంభమైందని పూర్తిగా, తృప్తిగా నమ్మకం కలగనంత వరకూ ఈ ఆరాధన ప్రారంభం కాదు. అలాగే రమజాన్ మాసం ముగిసిందని పూర్తి నమ్మకం కలగనంత వరకూ ఈ ఆరాధనలు (రోజాలు) కొనసాగుతూనే ఉంటాయి. దివ్యఖుర్ఆన్‌లో స్పష్టంగా ఇలా ఉంది :

"పవిత్ర ఖుర్ఆన్ అవతరించిన మాసం రమజాన్ మాసం. కనుక ఈ మాసాన్ని పొందిన వారు తప్పక రోజాలు పాటించాలి."

రమజాన్ మాసం ప్రారంభం నుండి ముగిసేవరకూ ప్రతి ముస్లిం తప్పకుండా ఉపవాస వ్రతం పాటించాలని పై సూక్తిలో స్పష్టంగా ఆదేశించడం జరిగింది. రమజాన్ మాసం ఉపవాసాలు పూర్తి కానంతవరకు పండుగ జరుపుకునే ప్రశ్నే తలెత్తదు. ఇక్కడ అసలు విషయం, రమజాన్ మాసం ముగింపేకాని ముస్లిముల సమైక్యత కాదు. ఈ మాసం ముగిసిందనే పూర్తి నమ్మకమే పండుగ జరుపుకోడానికి అసలు షరతు. దీన్నిబట్టి రమజాన్ ఒక చాంద్రమాన మాసం, చంద్రోదయంపైన్నే ఆధారపడి ఉందని తెలుస్తోంది.

ఈ విషయంలో దైవప్రవక్త (సల్లం) ఆదేశం స్పష్టంగా ఇలా ఉంది: "నెలవంక చూసి ఉపవాసాలు ప్రారంభించండి, నెలవంక చూసి ఉపవాసాలు ముగించండి. ఒకవేళ ఆకాశం మేఘావృతమైఉంటే ముప్ఫయి రోజులు పూర్తి చేయండి. లేక ఇద్దరు విశ్వాస పాత్రులైన వ్యక్తులు మేము నెలవంకను చూశామని సాక్ష్యం పలకాలి." దైవప్రవక్త (సల్లం) ఈ ఆదేశంలో రెండు విషయాలు స్పష్టం చేశారు. ఒకటి, ఆకాశం నిర్మలంగా లేక, మేఘావృతమై ఉన్నప్పుడు చంద్రదర్శన సాక్ష్యం అవసరముంది. రెండు, ఈ విషయంలో వార్తలపై ఆధారపడకుండా, విశ్వసనీయులైన ఇద్దరు వ్యక్తుల సాక్ష్యంపై చంద్రోదయ నిర్ణయం జరగాలి. సాక్ష్యం ఫోన్‌ద్వారా, రేడియో ద్వారా స్వీకరించబడదు. సాక్షులు కళ్ళముందు ఉండాలన్నది ప్రతి ఒక్కరికీ తెలిసిన విషయమే. మీరొకసారి న్యాయస్థానానికి టెలిఫోన్ ద్వారా సాక్ష్యం చెప్పి చూడండి. మీ సాక్ష్యం ఎంత వరకు స్వీకార యోగ్యమో మీకే తెలుస్తుంది. అంటే టెలిఫోన్ సాక్ష్యాన్ని నమ్మడానికి, స్వీకరించడానికి ఈ ప్రాపంచిక న్యాయస్థానాలే అంగీకరించడానికి సిద్ధంగాలేనపుడు,షరిఅత్ సంబంధిత కోట్లాది ముస్లింల రోజాలు ఫలవంతం కావడమో, భంగం కావడమో జరిగే అవకాశమున్నప్పుడు 'టెలిఫోన్ సాక్ష్యం' మన కెంతవరకు ఆమోదయోగ్యం?

అందుకని, ప్రపంచ ముస్లింలందరూ ఒకేరోజు పండుగ జరుపుకునేలా 'ఒకరోజు' నిర్ధారితం కావాలనే మాట ఎంత మాత్రం సమంజసం కాదు. ఈ విధంగా మాట్లాడేవారికి ఏ విధమైన షరిఅత్ జ్ఞానం, సామాజిక పరిజ్ఞానం లేదని అనుకోవాల్సి వస్తుంది. యావత్తు ప్రపంచంలో తప్పనిసరిగా ఒకేసారి,

ఒకేరోజు చంద్రదర్శనం కావడం అసంభవం. పోతే ఒక దేశంలో లేక ఒక ప్రాంతంలో ముస్లింలందరూ ఒకేసారి పండుగ జరుపుకోవాలని కూడా షరిఅత్ శాసించలేదు. ఒకవేళ షరిఅత్ హద్దులకు లోబడి చంద్రదర్శన సాక్ష్యాన్ని స్వీకరించి దాన్ని దేశమంతా ప్రకటన గావించే ఒక వ్యవస్థ ఏర్పాటు చేసుకొని దాన్ని అనుసరించడంలో ఎలాంటి అభ్యంతరం లేదు. అయితే ఇలా చేయడం తప్పనిసరి అని మాత్రం షరిఅత్ చెప్పడం లేదు. వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరుగా పండుగ జరుపుకోవడం కూడా షరిఅత్ దృష్టిలో నేరం కాదు. దైవధర్మం సార్వజనీన, సార్వకాలిక ధర్మం. యావత్తు మానవజాతి కోసం ఈ ధర్మం అవతరించింది. ఈనాడు రేడియో టివీల యుగంలో ఉన్నాం కాబట్టి అందరూ ఒకేరోజు పండుగ జరుపుకోవాలంటున్నారు. కాని, అరవై డెబ్భై ఏళ్ళ క్రితం యావత్ భారతదేశం మాట అటుంచి కనీసం ఏదో ఒక ప్రాంతంలో కూడా రమజాన్‌నెల 29వ తేదీ నెలవంకను దర్శించుకున్న సమాచారం ముస్లింలకు అందేది కాదు. ఒకవేళ ఒకేరోజు పండుగ జరుపుకోవాలని షరీఅత్ ఆదేశించి ఉన్నట్లయితే, గతశతాబ్దాల్లోని ముస్లిములు ఈ ఆదేశాన్ని ఎలా పాటించేవారు? అదేవిధంగా ఈనాడు కూడా ప్రపంచ ముస్లింలందరూ ఒకేరోజు పండుగ జరుపుకోవాలనే విషయం కూడా ఆచరణాత్మకంగా సాధ్యమయ్యే పనికాదు.

ముస్లింలు పెద్దపెద్ద పట్టణాల్లో, మెగాసిటీల్లోనే ఉండరు. సుదూర ప్రాంతాల్లో, చిన్నచిన్న ఊళ్ళలో కూడా ఉన్నారు. కొంతమంది అడవుల్లో, కొండకోనల్లో కూడా ఉన్నారు. అలాంటి పరిస్థితుల్లో అందరూ ఒకేరోజు పండుగ జరుపుకోవాలంటే, దేశంలో రేడియో స్టేషనుంటే సరిపోదు. ప్రతి ఒక్కరి దగ్గరా, లేక ప్రతి ఇంట్లో, ప్రతి వీధిలో, ప్రతి గల్లీలో కూడా రేడియో సెట్టు, ట్రాన్సిస్టర్, ఫోన్ కనెక్షన్ లాంటి సౌకర్యాలుండడం తప్పనిసరి. లేకపోతే వారు తమ ధార్మిక విధుల్ని పాటించలేరు. అలాంటప్పుడు ఈ ఆధునిక పరికరాలు కూడా ధర్మంలో ఓ తప్పనిసరి భాగాలై పోతాయా? దైవ ధర్మం ఎలాంటి పరిస్థితుల్లోనైనా ముస్లింలు తమ ధార్మిక విధులు నెరవేర్చ గలగడానికి సులువైన, సమంజసమైన విధానాలను ప్రతిపాదించింది.

అందుకే దైవధర్మం నమాజు వేళలను గడియారపు ముల్లుతో ముడి పెట్టలేదు. అలా పెట్టిఉన్నట్లయితే, ముస్లింలందరికీ ఆ గడియారం ఒక ధార్మిక వస్తువై పోయేది. అందుకే దేవుడు సూర్యోదయం, సూర్యాస్తమయం, సూర్యుడు వాలడం లాంటి సాధారణ దృష్టాంతాలను నమాజువేళలను గుర్తించే సాధనాలుగా చేశాడు. వీటిని ప్రతి మనిషి, ప్రతిచోటా చూడగలడు. అదేవిధంగా ఆయన రోజాలు ప్రారంభించడానికి, ముగించడానిక్కూడా రమజాన్, షవ్వాల్ నెలవంక దర్శనాన్ని సూచనగా నిర్ణయించాడు. ఇవి ప్రపంచవ్యాప్త, సాధారణ దృశ్యాలు. ప్రతిముస్లిం ప్రతిచోటా నెలవంకను చూసి రమజాన్ ప్రారంభమైందని లేదా ముగిసిందని సునాయాసంగా తెలుసుకోగల్గుతాడు. అలా కాకుండా క్యాలెండరు, పంచాంగాల ఆధారంగా తెలుసుకోవాలంటే, ప్రతి ముస్లిం ఖగోళ, జ్యోతిష్ శాస్త్రాలను అధ్యయనం చేయవలసి వచ్చేది. ఈ విధంగా పంచాంగం కూడా ధర్మంలో ఒక భాగమై పోయేది. అది లేకుండా ఏ ధార్మికవిధి నెరవేరని పరిస్థితి వచ్చేది.

ఒకవేళ నెలవంక దర్శనంతో యావత్ప్రపంచంలో ఒకేసారి రోజాలు ప్రారంభమవ్వాలని, ఒకేసారి ముగించాలని దేవుడు ఆదేశించినట్లయితే, సమాచార సాధనాలు అందుబాటులోకిరాని కాలంనాటి ముస్లింలు ధర్మాన్ని అనుసరించడం అసాధ్యమయ్యేది. ఒకవేళ సమాచార సాధనాలు అందుబాటు లోకి వచ్చిన కాలాన్ని తీసుకున్నా, తిండీ బట్ట లేకపోయినా ముస్లింలుగా మిగిలి ఉండాలంటే కనీసం ఒక ట్రాన్సిస్టరైనా వారివద్ద ఉండడం తప్పనిసరి అయిపోతుంది.

## పండుగ శుభాకాంక్షలకు అర్హులెవరు?

మిత్రులారా! ఈ సమస్యపై అత్యవసరమైన ఈ కొద్దిపాటి వివరణ తరువాత నేను మీకు, యావత్తు ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు అందజేస్తున్నాను. పవిత్ర రమజాన్ మాసంలో రోజాలు పాటించి, ఖుర్ఆన్ హితవుల నుండి సాధ్యమైనంత ఎక్కువ ప్రయోజనం పొందడానికి ప్రయత్నించిన వారు మాత్రమే ఈద్ శుభాకాంక్షలకు అర్హులవుతారు.

దివ్యగ్రంథాన్ని పారాయణం చేసి దాన్ని అర్థంచేసుకోడానికి ప్రయత్నించడం, దాని ద్వారా మార్గదర్శనం పొందడం, రమజాన్ మాసం ముస్లింల హృదయాల్లో జనింప జేయాలనుకున్న దైవభీతి (తక్వా)ని తమలో పెంపొందించుకున్నవారు నిజంగానే శుభాకాంక్షలకు అర్హులవుతారు. ఖుర్ఆన్ రమజాన్ రోజాలను గురించి రెండే కారణాలు చెప్పింది. వాటిలో ఒకటి, ముస్లిముల్లో దైవభీతి జనింపజేయడం.

**"కుతిబ అలైకుముస్సియాము కమా కుతిబ అలల్లజీన మిన్ ఖబ్లికుమ్ ల అల్లకుమ్ తత్తఖూన్."** (ఏవిధంగా మీకు పూర్వం వారిపై రోజాలు (ఉపవాసాలు) విధిగా నిర్ణయించబడ్డాయో అదేవిధంగా మీపై కూడా విధించబడ్డాయి. దీనివల్ల మీలో భయభక్తులు జనించాలని.") రెండవ కారణం, రమజాన్ నెలలో ఖుర్ఆన్ రూపంలో ఎనలేని వరాలు ప్రసాదించిన దేవునికి కృతజ్ఞత చెల్లించాలి. **"లితు కబ్బిరుల్లాహ అలామా హదాకుం వ లఅల్లకుమ్ తష్కురూన్."** (మీ ప్రభువు ఘనతను చాటండి. ఆయన మీకు మార్గదర్శనం చేశాడు. కనుక ఆయనకు కృతజ్ఞతలు చెల్లించండి.")

దేవుడు మానవుడికి అసంఖ్యాక వరాలను అనుగ్రహించాడు. గాలి, నీరు, అగ్నితోపాటు అతని భౌతికవసరాలకు కావలసిన సకల సదుపాయాలు సమకూర్చాడు. వాటి ద్వారా అతడు తన ఉపాధిని సమకూర్చుకుంటాడు, ఇల్లు కట్టుకుంటాడు, వస్త్రాలు తయారు చేసుకుంటాడు. ఇదంతా ఆ అనంత కరుణామయుని అనుగ్రహమే. ఈ ఉపకారాలు, వరాలు కేవలం అతని శారీరక అవసరాలు తీర్చడానికి మాత్రమే. కాని వీటన్నిటికీ మించిన మహదానుగ్రహం దివ్యఖుర్ఆన్ అవతరణ. ఈ అమూల్య వరం మానవుడి ఆత్మవికాసానికి, ఆధ్యాత్మిక ప్రగతికి, నైతిక పురోభివృద్ధికి, మానవతా వికాసానికి ఒక మహత్తర కానుక. ఒక విశ్వాసి దేవుడు అనుగ్రహించిన ప్రతి వరానికీ కృతజ్ఞతలు చెల్లిస్తాడు. ఖుర్ఆన్ రూపంలో తన కోసం మార్గదర్శక సూత్రాలు పంపిన ప్రభువు ముందు వినమ్రంగా సాగిలపడి తన విధేయతా కృతజ్ఞతలను చాటుకుంటాడు. అంతేగాని, కేవలం నోటితో 'దేవా! నువ్వు నాకు ఖుర్ఆన్ ప్రసాదించావు. నీకు కృతజ్ఞతలు' అని పైపై మాటలతో సరిపుచ్చడు. కృతజ్ఞతా

భావం అతడి హృదయజగత్తు నుండి ఉప్పొంగుతుంది. ఆ గ్రంథరాజాన్ని తన మార్గదర్శన జ్యోతిగా భావించి, ఆ జ్యోతి వెలుగులో తనజీవితాన్ని తీర్చి దిద్దుకుంటాడు. ఆచరణాత్మకంగా దాని ద్వారా ప్రయోజనాలు పొందుతాడు.

ఖుర్ఆన్ మీ వ్యక్తిగత జీవితం గురించి మీకు మార్గదర్శనం చేస్తుంది. మీరు ఏవిధంగా పరిశుద్ధ జీవితం గడపాలి? ఏ విధానాలు ఆచరిస్తే మీ జీవితం సాఫల్యపథంలో పయనిస్తుంది? ఏ పద్ధతులు అనుసరిస్తే మీ వ్యక్తిత్వ వికాసానికి నష్టం జరుగుతుంది? మీ వ్యక్తిత్వ వికాసానికి మీరు అవలంబించాల్సిన మార్గాలేవి? మీరొక పరిపూర్ణ మానవునిగా, మానవతావాదిగా రూపొందాలంటే ఏం చేయాలి? ఇలాంటి అనేక వ్యక్తిగత విషయాల్లో అది మానవుడికి మార్గదర్శనం చేస్తుంది. అది మీ సామూహిక జీవితానికి కావలసిన మార్గదర్శక సూత్రాలూ బోధిస్తుంది. మీ సామూహిక జీవనవిధానం ఎలా ఉండాలి? మీ కుటుంబజీవితం ఎలా గడవాలి? మీ నాగరికతా నడవడికలు ఎలా రూపొందాలి? దేశం ఎలాంటి సూత్రాల ప్రాదిపదికగా నడవాలి? మీ సామాజిక జీవనవ్యవస్థ, మీ చట్టాలు ఎలా ఉండాలి? ఏ మార్గాల్లో మీరు ఉపాధిని సమకూర్చుకోవాలి? ఏ మార్గాల్లో మీ ధనం ఖర్చుపెట్టాలి? దేవునితో, మీ మనోవాంఛలతో మీ సంబంధం ఎలా ఉండాలి? సాటి మానవుల పట్ల మీ సంబంధాలు ఎలా ఉండాలి? మీ భార్యాపిల్లలతో, మీ తల్లిదండ్రులతో, మీ బంధుమిత్రులతో, మీ ఇరుగుపొరుగు వారితో, ప్రపంచమానవాళితో మీ సంబంధాలు ఎలా ఉండాలి? చివరికి చెట్లు చేమలు, పశుపక్ష్యాదులు వగైరా దైవం ప్రసాదించిన ప్రతి అనుగ్రహం పట్ల మీ వైఖరి ఎలా ఉండాలి? మొత్తంమీద మానవ జీవితంలోని సకలరంగాల్లో ఖుర్ఆన్ మానవుడికి స్పష్టమైన మార్గదర్శనం చేస్తుంది.

కనుక ఇప్పుడు ఒక విశ్వాసి చేయవలసింది- అతడు దాన్ని ఒక మార్గదర్శక జ్యోతిగా అంగీకరించి స్వీకరించాలి. ఏ అవసరమొచ్చినా మార్గదర్శకం కోసం దాని వైపుకే మరలాలి. అందులో ఉన్న ప్రతి ఆదేశాన్ని, ప్రతి ఆజ్ఞనూ మనసా, వాచా, కర్మణా విశ్వసించి ఆచరించాలి. దానికి వ్యతిరేకంగా ఉన్న ప్రతి విషయాన్నీ నిర్ద్వందంగా తృణీకరించాలి. రమజాన్

నెలలో ఖుర్‌ఆన్‌ని ఈ దృష్టితో చూసి, దాన్ని అర్థం చేసుకోవడానికి, ఆచరించ డానికి, దాని హితోపదేశాలను నిజజీవితంలో ప్రతిబింబ జేయడానికి కృషి చేసిన వ్యక్తి నిజంగానే ఈ దైవానుగ్రహానికి కృతజ్ఞతలు చెల్లించిన వాడవుతాడు. అలాంటివాడే ఈ విషయంలో శుభాకాంక్షలకు అర్హుడవుతాడు. ఈవిధంగా అతను తనపై ఉన్న రమజాన్ హక్కును పూర్తిగా నెరవేర్చిన వాడవుతాడు.

రమజాన్ ఉపవాసాల రెండో లక్ష్యం 'మనలో దైవభీతిని జనింప జేయడం.' ఈ లక్ష్య సాధనకోసమే ఉపవాసాలు ముస్లింలకు విధిగా నిర్ణయించబడ్డాయి. ఒకసారి మీరు రోజా వాస్తవికతను గురించి ఆలోచిస్తే మనుషుల్లో దైవభీతిని జనింపజేయడానికి ఇంతకంటే మేలైన, వివేకవంతమైన మార్గం లేదని అర్థమవుతుంది. అసలు 'తఖ్వా' (దైవభీతి) అంటే ఏమిటి? 'తఖ్వా' అంటే మనిషి దేవుని అవిధేయతకు భయపడుతూ, దైవ విధేయతను స్వీకరించడం. ఉపవాసం రమజాన్ నెల యావత్తూ ఇదే పాఠాన్ని బోధిస్తుంది. సాధారణ స్థితిలో ధర్మసమ్మతమై ఉండే వస్తువులన్నీ రోజాస్థితిలో దైవాజ్ఞతో నిషిద్ధమైపోతాయి. మళ్ళీ దైవాజ్ఞతో ధర్మసమ్మతం అయ్యేవరకూ అవి నిషిద్ధంగానే ఉంటాయి.

నీళ్ళు అన్నివేళల్లో నిర్మలమైనవి, పవిత్రమైనవి, పరిశుద్ధమైనవి, కాని రోజాస్థితిలో దేవుడు నీటిని కూడా నిషేధించాడు. దాహంతో మీ నాలుక పిడచగట్టుకుపోతున్నా దైవాజ్ఞ ప్రకారం మీరు ఒక్కచుక్క కూడా చప్పరించరు. కాని ఎప్పుడైతే దేవుడు మీకు అనుమతినిస్తాడో అప్పుడు మీరు బంధనాలు తెంచుకున్నవాడిలా నీటి వైపుకు పరుగుతీస్తారు. నిరంతరాయంగా నెలరోజుల పాటు ఈ బంధించే, విప్పే ప్రక్రియ కొనసాగుతుంది. దీనివల్ల మీరు సంపూర్ణ దైవదాసులుగా, విధేయులుగా రూపొందే అవకాశం కలుగుతుంది. ఏ విషయాల నుండి దేవుడు మిమ్మల్ని వారిస్తున్నాడో వాటిని విడనాడడం, ఏ విషయాలను అవలంబించమని ఆయన ఆదేశిస్తున్నాడో వాటిని నెరవేర్చడం మీకు అలవాటై పోతుంది. దైవాదేశాలకు భిన్నంగా ఉన్న ప్రతి మనోవాంఛనూ జయించే శక్తి మీలో జనిస్తుంది. ఈవిధంగా, ఏ లక్ష్యంతో రోజాలు మీకు విధిగా నిర్ణయించబడ్డాయో ఆ లక్ష్యం నెరవేరుతుంది.

రమజాన్ రోజాల ద్వారా ఇలాంటి శిక్షణ పొందినవారే నిజానికి పండుగ శుభాకాంక్షలకు అర్హులవుతారు. ఈ నెల్లాళ్ళ శిక్షణ తర్వాత పండుగరోజు ఈ శుభాలను వదిలేయక, మిగతా పదకొండు నెలలూ ఈ శిక్షణా ప్రభావం ద్వారా ప్రయోజనం పొందేవారు పండుగ శుభకాంక్షలకు ఇంతకంటే ఎక్కువ హక్కుదారులవుతారు.

ఒక మనిషి తన శరీరానికి అవసరమయ్యే బలవర్ధక, పౌష్టికాహారం ఆరగించి, వెంటనే నోట్లో వేళ్ళుపెట్టి వాంతులు చేసుకుంటే దాని ద్వారా అతనికేమైనా ప్రయోజనం చేకూరుతుందా? ఏమాత్రం చేకూరదు. ఎందుకంటే, అతడు ఆ ఆహారానికి శరీరంలో జీర్ణమై రక్తంగా మారే అవకాశమే ఇవ్వలేదు. దీనికి భిన్నంగా మంచి ఆహారం తిని, అది జీర్ణమై రక్తంగా మారి ప్రవహించే అవకాశాన్ని కల్పిస్తే ఆ తిండి ఎంతో ప్రయోజనకారి అవుతుంది. కచ్చితంగా ఇదే సూత్రం రమజాన్ రోజాలకూ వర్తిస్తుంది. రమజాన్ మాసంలో రోజాలు నేర్పిన శిక్షణను పండుగ రోజే వదిలివేయకుండా మిగతా పదకొండు నెలలూ ఆ శిక్షణను మన జీవితంలో ప్రతిబింబజేసినప్పుడే దాని ప్రయోజనం మనకు పూర్తిగా చేకూరుతుంది. రమజాన్ రోజాల ద్వారా ఇలాంటి అనుగ్రహం సాధించేవారు నిజంగా పండుగ శుభాకాంక్షలకు అర్హులవుతారు.

## ఏమరుపాటు వహించేవారు.....

దురదృష్టవశాత్తు రమజాన్ మాసంలో కూడా దైవకారుణ్యం వైపునకు తొంగిచూడని వాళ్ళు కూడా ముస్లింలలో చాలామంది ఉన్నారు. రమజాన్ మాసం వస్తుంది, వెళ్ళిపోతుంది. కాని వారి గృహవాతావరణాల్లో, రమజాన్ మాసాన్ని గౌరవించే ముస్లింలు నివసిస్తున్న సూచనలేమీ కానరావు. ఇక ఉపవాసాల పాటింపు గురించిన ప్రశ్నే రాదు. కనీసం ఈ పవిత్ర మాసాన్ని గౌరవించే భాగ్యానిక్కూడా వారు నోచుకోరు. రమజాన్ నెలలో కూడా వారు 'ఇతరుల'లాగా పగటివేళ తింటూ తాగుతూ ఉంటారు. బంజరు నేలపై ఎంత వర్షం కురిసినా ఎలాంటి చెట్లూ చేమలూ మొలకెత్తవు. చుట్టుపక్కల భూములు పంటలతో, ఫలవృక్షాలతో కళకళలాడుతుంటాయి కాని, బంజరు భూమిలో ఒక గడ్డిపూచ కూడా కన్పించదు. అలా ఉంటుంది వీరి పరిస్థితి.

బీడు వారిన భూములకు వర్షాకాలం ఎలా ప్రాణం పోస్తుందో, అలాగే రమజాన్ నెల ఇస్లామీయ ఆత్మను వికసింపజేసే కాలం. ఒకవేళ దేవుడు 'మీ ఇష్టమొచ్చినప్పుడు రోజాలు పాటిస్తూ ముప్ఫయి రోజులు పూర్తి చేయండి' అని ఆదేశించినట్లయితే, మన ధార్మిక జీవితంలో ఈ వసంత రుతువే వచ్చేది కాదు. కాని మహా వివేకవంతుడైన దేవుడు 'ముస్లిములంతా ఒకేమాసంలో ఒకేసారి ఉపవాసాలు పాటించాలని ఆదేశించాడు. వర్ష రుతువులు రాగానే కొద్దిపాటి సారంగల భూములు సైతం పచ్చదనంతో అలరారుతాయి. ఇది రుతువులో ఉన్న శుభం. ఏ కొద్దిపాటి సారమున్న నేల కూడా ఆ శుభాన్ని అందుకోగలుగుతుంది. దీనికి భిన్నంగా వర్షరుతువు వచ్చినా ఏ మాత్రం పులకించని, గడ్డిపూచ కూడా మొలకెత్తించలేని భూములను గురించి చెప్పాలంటే, వాటిలో సారం పూర్తిగా చచ్చిపోయిందని, ఉత్పత్తి సామర్థ్యం మాట అటుంచి కనీసం అంకురించే గుణం కూడా అవి కోల్పోయాయని అర్థం చేసుకోవాలి. అదే విధంగా పవిత్ర రమజాన్ మాసం రాగానే ఏ కొద్దిపాటి విశ్వాసం ఉన్న ముస్లిం అయినా రమజాన్ రుతువుకు స్పందిస్తాడు. మిగతా పదకొండు నెలల కాలం ఎంత ఏమరుపాటులో గడిచినప్పటికీ రమజాన్ రాకతో అతని హృదయంలోని నిద్రావస్థలో ఉన్న విశ్వాస కణిక రాజుకుంటుంది.

ఒక నెల రోజులపాటు ముస్లిములందరూ ఒకేసారి సహెరి కోసం లేవడం, ఒకేసారి పొద్దస్తమాసం ఉపవాసం పాటించడం, ఒకేసారి రోజా విరమించడం, దాదాపు ఒకే సమయాన అందరూ తరావీహ్ నమాజులు ఆచరించడం మొదలైనవన్నీ ముస్లింల వీధుల్లో ఒక మహత్తరమైన సామూహిక వాతావరణాన్ని సృజిస్తాయి. ఈ శుభాల వల్ల మసీదులు నమాజీలతో కళకళ లాడుతూ ఉంటాయి. నలువైపులా పవిత్ర గ్రంథ పారాయణంతో పరిసరాలు ప్రతిధ్వనిస్తాయి. ఇతర దినాల్లో నమాజులు చేయనివారు కూడా ఈ పవిత్ర మాసంలో నమాజులు చేయడం ప్రారంభిస్తారు. ఇతర దినాల్లో అంతగా ధర్మాన్ని పట్టించుకోనివారు సైతం ఈ నెలలో ఉపవాసాలు పాటించడం ప్రారంభిస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో, ఇలాంటి వాతావరణంలో కూడా నమాజ్,

రోజా, ఖుర్‌ఆన్ పఠనం వైపు మొగ్గు చూపనివారి హృదయాల్లో రవ్వంతకూడా విశ్వాసం (ఈమాన్) లేదని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఇక ఇస్లాంతో వారి సంబంధం ఏమాత్రం లేనట్లే. దైవంతో, దైవధర్మంతో, ముస్లిం సమాజంతో ఉన్నటువంటి సంబంధాలన్నీ అతను తెంచి వేసినట్లే.

ఒక మనిషి ముస్లిం కుటుంబంలో జన్మించి, ముస్లిం సమాజంలో కళ్ళుతెరచి, ముస్లిం సమాజంలోని ఒక భాగమై, ఈ సమాజానికి, ఈ ధర్మానికి దూరమై ఈ మహోన్నత జీవనవ్యవస్థతో తన పవిత్ర బాంధవ్యాలను ఈ విధంగా తెంచుకోగల్గినవాడు రేపు ఈజాతికి ద్రోహం చేయడని గ్యారంటీ ఏమిటి? నమ్మించి మోసం చేయడని నమ్మకం ఏమిటి? మనోవాంఛలకు బానిసయి ఈనాడు ఇవన్నీ చేయగలిగిన వాడు రేపు మరెన్ని అఘాయిత్యాలకు పాల్పడతాడో ఊహించలేము.

మిత్రులారా! ఈ పరిస్థితులు మన సమాజంలో ఎందుకు ఉత్పన్న మవుతున్నాయో మనమంతా గంభీరంగా ఆలోచించాల్సిన అవసరముంది. ఏదో కొద్దిమందే ఇలా చేస్తున్నారంటే పోనీలే అని ఊరుకోవచ్చు. కాని, ఇక్కడ లక్షలు కాదు, కోట్ల సంఖ్యలో బహిరంగంగా రమజాన్ మాసంలో పగటివేళ తినే, త్రాగేవారున్నారు. అంతేకాదు ఉపవాసం పాటించేవారిని ఎగతాళి కూడా చేస్తుంటారు. ఇది చాలా శోచనీయమైన విషయం. మనమంతా దీనికి కారణాలను అన్వేషించే ప్రయత్నం చేయాలి. ఈ పరిస్థితులు తలెత్తడానికి ముఖ్యకారణం, సమాజసంస్కరణ కోసం దేవుడు, దైవప్రవక్త, దైవగ్రంథం చేసిన మహోన్నత కృషిని మనం చాలాకాలంగా పక్కన పెట్టేశాము. సమాజంలో, స్వయంగా మనలోనూ ఈ భావనలు ఉన్నాయా, మన విలువలు దిగజారి పోతున్నాయా అని కూడా మనం పట్టించుకోలేదు.

నేడు మనం మన ప్రజల ఐహిక జీవితాలను బాగుచేసే ఆలోచనలో పడిపోయ్యాం. దీనికోసం మనం చాలా పాట్లు పడ్డాం. కాని, నైతిక సంస్కరణ, ఆధ్యాత్మిక ప్రగతి, ఆత్మసంస్కరణల పట్ల; మహత్తరమైన ధార్మిక వ్యవస్థను పరిరక్షించడం పట్ల మనం ఘోరంగా ఉపేక్షించాము. ఏ నైతిక, ధార్మిక పునాదులపై మన సామాజిక వ్యవస్థ నిలబడిఉందో వాటిపట్ల మనం నిర్లక్ష్యం

ప్రదర్శించాం. దీనికి భిన్నంగా మనవద్ద పెద్దఎత్తున ఈ పునాదులను కదలించగల విద్యాశిక్షణలు, చట్టాలు, శాసనాలు ఎన్నో రూపుదిద్దుకున్నాయి. వీటి ఫలితాలనే నేడు మనం చవిచూస్తున్నాం. మనలోనే ఓ పెద్దవర్గం ఇస్లామియ ఆరాధనలు, ఆచార వ్యవహారాలను చాలా సునాయాసంగా ఉల్లంఘిస్తోంది. కనీసం వారి ప్యాంటుకు మట్టి అంటితే పడేంత బాధకూడా వారు ఇస్లాం ఆదేశాలను ఉల్లంఘిస్తూ వ్యక్తం చేయరు. ఎంత దయనీయం?

## లాతుఫ్‌సిదూ ఫిల్‌అర్‌జి బఅద ఇస్లాహిహా

మహాశయులారా! మానవుడ్ని సంస్కరించడం ఎంతో కష్టంతో కూడు కున్న పని. కాని అతణ్ణి చెడగొట్టడం మాత్రం చాలా తేలిక. సంస్కరణ కోసం ఏళ్ళకు ఏళ్ళు నిరంతరం శ్రమించాల్సి ఉంటుంది. చెడగొట్టడానికి ఎలాంటి శ్రమ, ప్రయత్నాలు అవసరం లేదు. సంస్కరణా ప్రయత్నాలు చేయకుండా ఉంటే చాలు. మానవ సమాజం తనంత తాను చెడిపోతుంది. ఒక పిల్లవాణ్ణే ఉదాహరణగా తీసుకోండి. మీరతడ్ని ఒక మంచి, ఉన్నత సంస్కారవంతుడిగా చెయ్యాలంటే మీరు సంవత్సరాల తరబడి శ్రమించాల్సి ఉంటుంది. అప్పుడే మీరతని ఆలోచనలు, అలవాట్లు, నడవడిక, గుణగణా లను తీర్చిదిద్ద గలుగుతారు. కాని అతడు చెడిపోవాలని అనుకుంటే మాత్రం మీరు ఏమీ చేయనవసరం లేదు. మీరతడ్ని పట్టించుకోకుండా వదిలేస్తే చాలు. సమాజంలోని భ్రష్టుల వెంట తిరిగి అతడు స్వయంగా చెడి పోతాడు. శ్రమ, కృషి, ప్రయత్నాలు ప్రగతి కోసమే అవసరమవుతాయి. పతనానికి వాటి అవసరమే లేదు.

మీరొక వాహనాన్ని మిట్టపై ఎక్కించాలంటే కష్టపడాల్సి ఉంటుంది. కష్టపడకుండా, తెలివి ఉపయోగించకుండా బండి మిట్టపై ఎక్కదు. అదే పల్లానికయితే ఎలాంటి శక్తి ఉపయోగించ నవసరం లేదు. బ్రేకులు వదిలేస్తే చాలు పల్లం ఉన్నంతవరకు కష్టపడకుండానే వెళ్ళిపోతుంది. ఇలాంటి సూత్రమే మానవసమాజానికీ వర్తిస్తుంది. ఒక సమాజాన్ని సంస్కరించి, ఉన్నత నైతిక విలువలగల వ్యవస్థను స్థాపించాలంటే చాలా కష్టపడవలసి ఉంటుంది. ఈ ప్రయత్నంలో శతాబ్దాలు గడిచినా గడవచ్చు. అయితే ఈ ప్రయత్నాల

ఫలాలను వృథా చేయడానికి మాత్రం మీరా వ్యవస్థను రక్షించడం మాను కుంటే చాలు. కావలసినంత చెడు సమాజంలో ప్రబలిపోతుంది.

ముస్లిముల్లో జనించిన సుగుణాలు యాదృచ్ఛికంగా జనించినవి కావు. మానవ మహోపకారి ముహమ్మద్ (సల్లం), ఆయన అనుచరులు, వారి తర్వాత ఉమ్మత్ శ్రేయోభిలాషులు, ధర్మవేత్తలు, ధార్మిక పండితులు శతాబ్దాలపాటు శ్రమించి, ప్రజలను కుఫ్ర్ (సత్యతిరస్కారం), షిర్క్ (బహుదైవా రాధన)ల నుండి వారిని బయటికి తీశారు. నైతికంగా వారిని తీర్చిదిద్ది ఉన్నత శిఖరాలకు చేర్చారు. దరాచారాలను, దుష్ట విధానాలను రూపుమాపారు. ఏకదైవారాధన కోసం సమాయత్తపరిచారు. పరలోక చింతనను వారిలో పాదుగొల్పారు. పరలోకంలో దేవుని ముందు సమాధానం చెప్పుకోవాలనే బాధ్యతాభావాన్ని వారిలో జాగృతం చేశారు. నైతిక విలువలు, మానవతా విలువలను గురించి శిక్షణ గరిపి ఓ ప్రత్యేక వ్యక్తిత్వాన్ని వారిలో రూపొం దించారు. నమాజ్, రోజా, జకాత్, హజ్‌లాంటి పవిత్ర ఆరాధనలు వారికి పరిచయం చేశారు. ఇస్లామీయ జీవన వ్యవస్థకు సంబంధించి ఓ నాగరికతను రూపొందించి వారికి అంద జేశారు. దీన్ని అవలంబించే ముస్లింల జీవన సరళిని చూసి ఇతరులు ఈర్ష్య పడేవారు. ఇదంతా ఒక్క రోజులో జరిగింది కాదు. శతాబ్దాల తరబడి నిరంతరాయంగా చేసిన అమూల్యమైన కృషి, శ్రమ, ప్రయత్నాల ఫలితమిది. దీన్ని మనం వృధా చేయదలచుకుంటే చాలా తేలిగ్గా చేయవచ్చు. కాని వృధా చేసినదాన్ని తిరిగి సాధించాలంటే మాత్రం శతాబ్దాలకు శతాబ్దాలు పడుతుంది.

మన దురదృష్టం ఏమిటంటే, మన పూర్వీకులు వందల సంవత్సరాలు శ్రమపడి మన సమాజంలో చేసిన సంస్కరణను మనం ఒకేఒక్క శతాబ్దంలో-గడిచిన శతాబ్దంలో దారుణంగా వృధా చేశాము. మొదట్లో ఆంగ్లేయుల బానిసత్వంలో అది చాలా వరకు వృధా అయింది. ఇప్పుడు వారి బానిసత్వం అంతమైన తర్వాత స్వయంగా మన అధికారకాలంలో అంతకంటే ఎక్కువగా వృధా చేస్తున్నాము. ఇది రెట్టింపు తప్పు. దీన్ని గురించి ఖుర్‌ఆన్‌లో అనేకచోట్ల "లాతుఫ్సిదూ ఫిల్‌అర్జి బఅద ఇస్లాహిహా" (భువిలో సంస్కరణ జరిగిన తరువాత అందులో కల్లోలం రేకెత్తించకండి.) అని చెప్పబడింది.

యావత్తు భూమండలంలో నివసించే మానవుల జీవితాల్లో ఏదైనా సంస్కరణ జరిగిందీ అంటే, అది దైవప్రవక్తలు, వారి తరువాతి సజ్జనుల వేల సంవత్సరాల కృషి ఫలితంగా మాత్రమే జరిగింది. ఒక్కొక్క చెడును రూపుమాపడానికి, ఒక్కో మంచిని నెలగొల్పడానికి సచ్ఛీలురైన దైవదాసులు సంవత్సరాల తరబడి శ్రమించారు. అందువల్లనే ప్రపంచంలో మహోన్నతమైన నైతిక విలువల నవనాగరికత ఉనికిలోకి వచ్చింది. దీని ఉనికిని, నిర్మాణాన్ని రూపుమాపడం క్షణాల్లో పని. కాని మళ్ళీ దానికి ఊపిరి పోయడం, ఆ నిర్మాణాన్ని నిలపడం బొమ్మలాటకాదు. ఓ చిన్న ఉదహరణ చూడండి! 'స్త్రీ పురుషుల మధ్య నికాహ్ ద్వారా సంబంధం ఏర్పడుతుంది.' మనిషిని వివాహం కోసం ఒప్పించడం, దానికి కట్టుబడేలా చేయడం, సమాజంలో దానికొక ప్రామాణిక స్థాయిని కల్పించడం, దాన్ని పవిత్రబంధంగా ప్రజలకు పరిచయం చేయడం సామాన్య విషయం కాదు. దైవప్రవక్తలు, నీతిమంతులయిన మహనీయులు దీనికోసం ఏళ్ళ తరబడి శ్రమపడి ఉంటారు. అప్పుడే లోకంలో ఈ రకమైన ఒక సామాజిక సంస్కరణ సాధ్యమై ఉంటుంది.

మానవుల్లోని సహజసిద్ధమైన లైంగిక శక్తి, ఆకర్షణలను ఒక నైతిక చట్రంలో బంధించడం సాధారణ విషయం కాదు. ఇలాంటి మహత్తరమైన నైతిక సంస్కరణను వృధా చేయాలంటే, ఎంతో కష్టపడాల్సిన అవసరంలేదు. స్త్రీ పురుషుల లైంగిక స్వేచ్ఛకు మార్గాలు తెరవండి. కుటుంబ నియంత్రణను సర్వసామాన్యం చేయండి, ఇక చూడండి. 'మన పెద్దలు ఎంతో కష్టపడి బంధించిన విశృంఖలతా భూతం బంధనాలను తెంచుకొని చూస్తుండగానే దశాబ్దాల తరబడి కృషిచేసి సాధించిన సంస్కరణను సర్వనాశనం చేసివేస్తుంది. ఈ వినాశనకర ఫలితాలు ముంచుకొచ్చి ఈనాడు పాశ్చాత్య సమాజం ముందు భయానక రూపంలో నిలబడి ఉన్నాయి. ఈ విశృంఖులతా భూతాన్ని పట్టి బంధించాలని భావిస్తే అదేమంత తేలికైన వ్యవహారం కాదు. దానికోసం మళ్ళీ దశాబ్దాల తరబడి తీవ్రంగా శ్రమించాల్సి ఉంటుంది. అందుకే దివ్యఖుర్ఆన్ మానవత్వాన్ని నాశనం చేయజూసే వారిని తీవ్రంగా హెచ్చరించింది. "బహు కష్టంతో భువిలో నెలకొన్న సంస్కరణా వాతావరణాన్ని గర్వంతో నాశనం చేయకండి."

మహత్తరమైన ఇస్లామీయ సంస్కృతీ, నాగరికతల నిర్మాణం ఎన్ని కష్టాలు, ఎన్ని త్యాగాల ద్వారా సాధ్యమై ఉంటుందో మీరే ఊహించండి. ఎంత అంధకారాన్ని, ఎంత అజ్ఞానాన్ని, ఎన్ని దురాచారాలను రూపుమాపి దీనికోసం రంగం సిద్ధం చేయబడిందో, ఎంతమంది త్యాగధనులు నిజమైన భావనలు, ఆచార వ్యవహారాలను, ప్రజల మనస్సుల్లో నాటగలిగారు, నైతికతను, మానవతను సమాజంలో స్థాపించడానికి ఎన్నో ప్రయత్నాలు జరిగాయి, ఈ విధంగా ఈ మొత్తం నిర్మాణాన్ని స్థిరపరచడానికి, ఇస్లామీయ జీవనవ్యవస్థకు మూలమైన విశ్వాసం, దేవుని ఏకత్వం నమాజ్, రోజా, జకాత్, హజ్ అనే మూలస్థంభాలను పాతడం జరిగింది. ఇదంతా మన పూర్వీకుల అపూర్వ కృషి ఫలితంగానే జరిగింది.

అంతేకాదు ఈ మహానిధి మనకు వారసత్వంలో ఉచితంగా లభించింది. దీన్ని మనం అభివృద్ధి పరచలేకపోయినా కనీసం నాశనం చేయకుండానైనా ఉండాలి కదా! మన విద్యావ్యవస్థ మన సాహిత్యం, మన ఆలోచనలు, భావాలు, మన చట్టాలు, ఆర్థిక, సామాజిక పాలనా వ్యవస్థలన్నీ మన ఈ నిధిని అగౌరవ పరిచేవారినీ, దీన్ని నాశనం చేసేవారినీ రోజురోజుకూ అత్యధిక సంఖ్యలో తయారు చేస్తున్నాయి. ఈ పరిస్థితి చూస్తుంటే ఏదో ఒక రోజు మన మీ నిధిని పూర్తిగా కోల్పోయే పరిస్థితి రావచ్చనిపిస్తోంది. ఒకసారి మన చేతి నుండి ఈ నిధి జారిపోతే మళ్ళీ దీన్ని సాధించడం సులభం కాదు. దేవుడు మేలుచేసి ఆ దుస్థితి రాకముందే మనం మేల్కొంటే మంచిది.